క్లుప్తంగా

వేరుశనగ విత్తనాల పంపిణీ



గుడిపాల: మండలంలోని రామభద్రాపురం, తిమ్మయ్యపల్లె పంచాయతీలో గురువారం వేరుశనగ విత్తనాలను పంపిణీ వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 30 కేజీల బస్తాధర రూ.1675 అన్నారు. 10వ తేదీ వరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో అర్హులైన రైతులకు ఇస్తామని, తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె రైతులను కోరారు. స్థానిక ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ రామభద్రాపురంలో విత్తన కాయలు పంపిణీ చేశారు.

ప్రతిభా అవార్డులకు ఎంపిక



పవిత్రసాయి, వాగీస్వరన్

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో మిట్టూరులోని రుక్మిణి కృష్ణస్వామి (ఆర్.కే) విద్యాలయ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిభా అవార్డులకు తమ కళాశాలలో ఎంఈసీ చదువుతున్న పవిత్రసాయి 1000 మార్కులకు 977, వాగిస్వరన్ 945 మార్కులు సాధించి ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకుంటారని తెలిపారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి



విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలిస్తున్న డీవైఈఓ ఇందిర

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు అన్నింటా రాణించాలని చిత్తూరు డీవైఈఓ ఇందిర అన్నారు. బాలభవన్ ఆధ్వర్యంలో బీఎస్ కణ్ణన్ పాఠశాలలో నిర్వహిస్తున్న చిత్రలేఖనం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని డీవైఈఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, చిన్నారులు ఉత్సాహంగా చిత్రలేఖనం నేర్చుకోవడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు వేసిన చిత్రాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా బాలభవన్ సూపరింటెండెంట్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



గర్భవతికి చికిత్స చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని జొన్న గురకల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 27 మంది రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. అదే విధంగా గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయని స్పష్టం చేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సగౌరవంగా చివరి మజిలీ..!

- చిత్తూరు శ్మశాన వాటిలో అధునాతన సౌకర్యాలు
- బర్నింగ్ యంత్రాలతో మృతదేహాలకు అంత్యక్రియలు
- దాతల భూరి విరాళాలతో నిర్మాణాలు.. సౌకర్యాలు
- నేడు ప్రారంభం కానున్న కైలాశధామం, మహా ప్రస్థానం

ప్రతి మనిషి జీవితంలో అద్భుతమైనది పుట్టుక.. విషాదాన్ని మిగిల్చేది మరణం. చనిపోయాక పార్థివ దేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియ లు చేయడానికి కొందరు పడేపాట్లు అన్నీ ఇన్నీ కావు. తీరా తీసుకెళ్లిన తరువాత దహనక్రియలు నిర్వహించే ప్రదేశాన్ని చూస్తే.. చివరి మజిలీలో కూడా గౌరవం ఇవ్వకుండా అంత్యక్రియలు ఇలా చేస్తారా? అనే బాధ కలిగిస్తుంది. చిత్తూరులోని మునిసిపల్ శ్మశాన వాటికలో అలాంటి పరిస్థితులను అధిగమించి, మునిసిపల్ కార్పొరేషన్ స్థలంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సర్వీస్ ట్రస్ట్, చిత్తూరు ఆర్య వైశ్య సంఘ సంయుక్త ఆధ్వర్యంలో కైలాస ధామం మహా ప్రస్థానాన్ని నిర్మించారు. శుక్రవారం నుంచి ఇది అందుబాటులోకి వస్తోంది.

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని కైలాశపురం శ్మశాన వాటికలో మృతదేహాలను ఖననం చేస్తుండడంతో భవిష్యత్తులో స్థల సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఇక్కడ దహన క్రియలు చేయడానికి పెద్దగా వసతులు లేవు. దీంతో శ్మశానవాటిక ఎదురుగా ఉన్న దాదాపు 2 ఎకరాల స్థలంలో గ్యాస్ ఆధారిత మృతదేహాల దహన క్రియలు నిర్వహించాలని ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు వచ్చాయి. మధ్యలో వచ్చిన అవాంతరాలను అధిగమించి, రెండు ఎకరాల వరకు విస్తీర్ణం ఉన్న స్థలాన్ని కార్పొరేషన్ అధికారులు లయన్స్‌క్లబ్, ఆర్యవైశ సంఘ ట్రస్టు పేరిట లీజుకు ఇచ్చారు. భారీ ప్రహరీ నుంచి గ్యాస్ బర్నింగ్ యంత్రాలు, పరమేశ్వరుడి భారీ విగ్రహం, శ్మశాన వాటిక చుట్టూ పచ్చదనం, ఉత్తర క్రియల నిర్వహణకు హాలు, దహన క్రియల అనంతరం చితాభస్మాన్ని భద్రపరచడానికి లాకర్ల సౌకర్యాలను కల్పించారు.



శ్మశాన వాటికలో నిర్మించిన భారీ భవన సముదాయం

అందరి భాగస్వామ్యం

కై లాశ ధామం మహాప్రస్థాన నిర్మాణంలో చిత్తూరుకు చెందిన ప్రముఖులు తలా చేయి వేసి.. భూరి విరాళాలు ఇవ్వడంతో అనుకున్న సమయానికి నిర్మాణాన్ని పూర్తి చేశారు. అమరరాజ గ్రూపుల సంస్థ చైర్మన్ గల్లా రామచంద్రారెడ్డి రూ.50 లక్షలు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు రూ.30 లక్షలు, బీవీ.రెడ్డి విద్యాసంస్థలు రూ.20 లక్షలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయానందరెడ్డి రూ.10 లక్షలు, లయన్స్ భానుమూర్తి రెడ్డి రూ.10 లక్షలు, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త అమరీ, లయన్స్ శ్రీధర్‌రెడ్డి లాంటి వ్యక్తులు శ్మశాన వాటికలో రూ.లక్షల వ్యయంతో ఒక్కో పనిచేయించారు.

కార్పొరేషన్ పర్యవేక్షణ అవసరం

రూ.కోట్ల విలువ చేసే శ్మశాన వాటిక స్థలాన్ని కార్పొరేషన్ అధికారులు ప్రజల సౌకర్యార్థం ఉచితంగా ఇవ్వడంతో నిర్వహణ బాధ్యతలు ఆర్య వైశ్య సంఘం, లయన్స్ క్లబ్ చూస్తున్నాయి. దీనిపై పూర్తి స్థాయి అజమాయిషీ మాత్రం కార్పొరేషన్ అధికారులు ఉంచుకోవడం మంచిదనే మాట వినిపిస్తోంది. ఇక్కడ జరిగే ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, సమస్యలు ఏదైనా తలెత్తితే వాటిని పరిష్కరించడం, నిధుల దుర్వినియోగం లాంటివి జరిగితే వెంటనే కైలాశధామంను స్వాధీనం చేసుకోవడం లాంటి షరతులు, నిబంధనలు కార్పొరేషన్ అధికారులు రూపొందించాలి. అప్పుడే నిర్వాహకుల్లో బాధ్యత పెరగడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



దహనక్రియలకు ఉపయోగించే గ్యాస్ ఆధారిత బర్నింగ్ యంత్రం



చితా భస్మాన్ని భద్రపరచే లాకర్లు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

యాదమరి: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీఓ వేణు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సంపద సృష్టి కేంద్రం వద్ద ఏపీఓ సంధ్యారాణితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీఓ చరిత మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ అవుతుండడంతో పర్యావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుని సమస్త మానవాళి ప్రమాదంలో పడుతోందని తెలిపారు. సమస్త జీవరాశి మనుగడ కొనసాగించాలంటే అందరూ మొక్కలు నాటాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుకుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు మహాకుంభాభిషేకం



నూతనంగా నిర్మించిన ఆలయం

తవణంపల్లె: మండలంలోని సరకల్లులో నూతనంగా నిర్మించిన శ్రీమహా కాళికాదేవి దేవాలయానికి శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని స్థానిక సర్పంచ్ సతీష్‌రెడ్డి తెలిపారు. దాతలు కత్తి సుధాకర్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఆర్థిక సహాయంతో దేవాలయాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పాల్గొంటారని వివరించారు.

నేడు పీహెచ్‌సీలో బీపీహెచ్ యూనిట్ ప్రారంభం

మండల కేంద్రమైన తవణంపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభిస్తామని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు.

మద్దతు ధరకే కొనాలి



ఆర్ఎంఎం ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడుతున్న రైతులు

- ఫ్యాక్టరీ నిర్వాహకులను నిలదీసిన మామిడి రైతు నాయకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలోని పలు ఫ్యాక్టరీలు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలను ధిక్కరిస్తున్నాయి. కలెక్టర్ నిర్ణయించిన ధరను తేలికగా తీసుకుంటున్నాయి. రెండు రోజుల క్రితమే తోతాపురి కాయ కేజీ ధర రూ.12కి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అయితే కొన్ని ఫ్యాక్టరీలు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. వాళ్లు నిర్ణయించిన ధరలకే కాయలను కొనుగోలు చేస్తున్నాయి. తమిళనాడు నుంచి వచ్చే మామిడిపై దృష్టి సారించాయి. అక్కడ కేజీ రూ.5కే కొనుగోలు చేసి ఫ్యాక్టరీ నిర్వాహకులు జిల్లాలోని ఫలంపై చిన్న చూపు చూస్తున్నాయి. పాడికాయల పేరుతో గుజ్జు వ్యాపారాన్ని పుంజుకునేలా చేస్తున్నాయి. ఇది తెలుసుకున్న జిల్లాలోని రైతులు గురువారం చిత్తూరు నగరంలోని ఆర్ఎంఎం ఫ్యాక్టరీలోకి వెళ్లారు. గిట్టుబాటు ధరకు కాయలను కొనుగోలు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. కలెక్టర్ నిర్ణయించిన కేజీ ధర రూ.12కే కాయలను కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. లేకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఆనందనాయుడు, హరిబాబుచౌదరి, వెంకటరెడ్డి, త్యాగరాజరెడ్డి, సోమశేఖర్, మాపాక్షి, తుమ్మింద రైతులు పాల్గొన్నారు.

ఎండీయూ రద్దుతో అదనపు భారం

- కమీషన్ పెంచాలని రేషన్ డీలర్ల డిమాండ్

గుడిపాల: ఎండీయూ వాహనాలు రద్దు చేసి సరకుల పంపిణీ రేషన్ దుకాణాలకు అప్పగించడం వల్ల తమకు అదనంగా ఒరిగేదేమి లేదని, జూన్ నుంచి పాత విధానంలో రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ వల్ల అదనపు పనిభారం పెరుగుతోందని డీలర్లు పేర్కొంటున్నారు. గతనెల వరకు ఎండీయూ వాహనాలకు సరకులను ఇవ్వడం వరకు మాత్రమే డీలర్ పనిగా ఉండేది. బియ్యం, పంచదార కిలోకు ఒక రూపాయి కమీషన్ వచ్చేది. అలాగే గోనె సంచులను విక్రయంతో కొంత మొత్తం వచ్చేది.

అదనపు ఖర్చులు

ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇక ఖర్చులు భారం పడుతుందని డీలర్లు చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి దుకాణం అద్దెకు తీసుకోవడం, కరెంటు బిల్లులు, ఈ-పాస్ మిషన్‌కు నెట్ కనెక్షన్, రేషన్‌షాపులో తూనిక చేసేందుకు ఒక సహాయకుడు, రికార్డుల నిర్వహణ..ఇలా ఖర్చులు ఉంటాయని డీలర్లు సమస్యల చిట్టా విప్పుతున్నారు. ఇదిలా ఉండగా దివ్యాంగులు, వయో వృద్ధుల ఇళ్లకే రేషన్‌ను తీసుకువెళ్లడం కూడా అదనపు భారమేనని వాపోతున్నారు. ప్రస్తుతం డీలర్లకు బియ్యం, పంచదారపై కిలోకు ఒక రూపాయి చొప్పున ప్రభుత్వం కమీషన్ ఇస్తోంది. వాస్తవానికి కేంద్రం డీలర్లకు రూ.2, రాష్ట్రం మరొక రూపాయి కలిపి రూ.3 ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేవలం ఒక్క రూపాయని కమీషన్ ఇచ్చి రాష్ట్రప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని డీలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కమీషన్, బియ్యం తరుగుపై ప్రశ్నిస్తే దాడులు చేసి దుకాణాలను రద్దు చేస్తారనే భయంతో డీలర్లు ప్రశ్నించేందుకు ముందుకురావడం లేదు. ఎండీయూ వాహనాలు ఖర్చు తగ్గిన నేపథ్యంలో తమ కమీషన్ పెంచాలని డీలర్లు కోరుతున్నారు.



రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

నోటీస్ బోర్డు

నేడు పీహెచ్‌సీ అదనపు భవనం ప్రారంభోత్సవం

ఐరాల: మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. ఇక్కడ రూ.50 లక్షలతో పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని నిర్మించారని తెలియజేశారు.

నేడు వేరుశనగ విత్తనకాయల పంపిణీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు, దిగువమాసాపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటలకు టోకెన్లు పంపిణీ చేసి, దాని తర్వాత కాయలు పంపిణీ చేయనున్నారు.

పుస్తక పఠనంతో వికాసం



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకుంటే మేథో వికాసం పెంపొందుతుందని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు గణితం, జీకే, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, వేమన పద్యాలు చదివించడం, సెల్‌ఫోన్ వల్ల కలిగే నష్టాలు, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు.విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

విత్తన లోటుపై ఇంత నిర్లక్ష్యమా?

- ప్రభుత్వం, అధికారుల తీరుపై మండిపడ్డ ఎంపీపీ సురేష్
- విద్యుత్తు ఏఈ తీరుపై అసహనం
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

యాదమరి: రైతులకు అందించాల్సిన వేరుశనగ విత్తనాల లోటుపై ప్రభుత్వం, అధికారుల తీరుపై ఎంపీపీ సురేష్ మండిపడ్డారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అభివృద్ధి పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ వేణు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సురేష్ మాట్లాడుతూ... రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు అధికంగా వర్షాధార పంట వేరుశనగపై ఆధారపడుతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మండలానికి అధిక మొత్తంలో విత్తనాలను మంజూరు చేయించాల్సిన అధికారులు, నాయకులు.. కేవలం 60 శాతం వేరుశనగ విత్తన కేటాయింపులతో కేవలం 684 బస్తాలతో పంపిణీకి సిద్ధమవ్వడం సమంజసం కాదన్నారు. 40 శాతం లోటుతో నిజమైన అర్హత కలిగిన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం 2024లో 1054 బస్తాలను మండలానికి కేటాయించిందన్నారు. మండలంలోని దానరాపల్లి, కాశీరాళ్ల పంచాయతీల్లో రాత్రి వేళలో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. వీటి స్థానంలో కొత్త బల్బులు ఏర్పాటు చేయాలని సంబంధిత ఏఈకి పలుమార్లు విన్నవించుకున్నా స్పందించ లేదన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు విద్యుత్ ఏఈ తీరును ఎండగట్టారు. అయితే ఈ సమావేశానికి ఏఈ గైర్హాజరయ్యారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టామని.. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను ఏపీఓ సంధ్యారాణి వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య మాట్లాడారు. విద్యార్థులు శిబిరంలో ఏమేమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కామన్ ఎగ్జామ్ బోర్డు సెక్రటరీ హేమాద్రి, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, సహాయ లైబ్రేరియన్ గజేంద్రబాబు, సిబ్బంది గుణశేఖర్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో మెడికల్ క్యాంపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండులో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు మధుమేహ పరీక్షలు చేశారు. అనంతరం వైద్యాధికారులు దయాసాగర్, గిరి, శ్రీవాణి వారికి పలు సూచనలు చేశారు. మధుమేహ వ్యాధిని తేలికగా తీసుకుంటే... ప్రాణం మీదకు తీసుకొస్తుందన్నారు. తగిన జాగ్రత్తలు పాటించడంతోపాటు వైద్యం చేయించుకోవాలని వారు పేర్కొన్నారు.

వేడుకగా చక్రస్నానం



యాదమరి: యాదమరిలోని శ్రీ ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు గురువారం త్రివేణి సంగమంలో చక్రస్నానం పరిసమాప్తమయ్యాయి. తొలుత శ్రీపెరూందేవి సమేత శ్రీ వరదరాజస్వామికి, చక్రతాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం త్రివేణి సంగమంలో అర్చకులు శాస్త్రోక్తంగా చక్రతాళ్వార్‌కు పవిత్ర స్నానమాచరించారు. అనంతరం రాత్రి భక్తజన సందోహం నడుమ ధ్వజావరోహణం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలి

- డీవైఈవో ఇందిర

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలని చిత్తూరు డీవైఈఓ ఇందిర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం డీఈఓ కార్యాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రహరీ గోడ ఉన్న ప్రతి పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జూన్ 12వ తేదీ పాఠశాలలు పునః ప్రారంభం రోజున మొక్కలతో విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు. భావితరాలు కాలుష్యరహితమైన వాతావరణంలో పెరిగేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌జీసీ జిల్లా సమన్వయ కర్త బాలచైతన్య, ఏపీఎస్‌జీసీ క్లస్టర్ కో-ఆర్డినేటర్ హసన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తవణంపల్లె: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. జాతీయ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని టి.పుత్తూరులో వనమహోత్సవం నిర్వహించారు. ఇంకుడు గుంతల చుట్టూ మొక్కలు నాటారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఏపీడీ సుబ్రమణ్యం, ఈజీఎస్ ఏపీఓ బాల మాట్లాడారు. మండలంలోని 32 పంచాయతీల్లో ఫారం ఫండ్‌ల దగ్గర 890 మొక్కలు నాటించినట్లు చెప్పారు. రైతుల సరిహద్దు కందకాల వద్ద 50 మొక్కల చొప్పున నాటించామని, ఈచనేరి నర్సరీ నుంచి 1,300 మొక్కలు రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, శ్రామికులు, రైతులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డీవైఈఓ ఇందిర



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

గుడిపాల: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాబ్‌జాన్ అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు వృక్షాలే ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నా రు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల ఆవరణలు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ-మనందరి బాధ్యత అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

చిత్తూరు కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒకరు కృషి చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అర్బన్ ఈఈ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి ఆయన మాట్లాడారు.





తవణంపల్లె: టి.పుత్తూరు ఫారంఫండ్ వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు